శ్రీలక్ష్మీనరసింహస్వామికి పూజలు


హారతి అందుకుంటున్న భక్తులు

మంగపేట, న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరు హేమాచల గుట్టలపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. చింతామణి జలపాతంలో స్నానాలు అంచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేక కార్యక్రమాలను తిలకించారు. అర్చకులు పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం ఆగస్టు 31, 2026

ప్రత్యేక తరగతుల భత్యం పక్కదారి

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి వార్షిక పరీక్షల్లో తప్పినవారు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు(రెమిడియల్) నిర్వహించింది. ఆ తరగతులకు హాజరైన వారికి ఒక్కొక్కరికి రూ.1000 రవాణా భత్యం, నోటు పుస్తకాలు, పెన్నుల కోసం రూ.100 కేటాయించింది. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి 378 మంది అనుత్తీర్ణులయ్యారు. వీరికి ప్రభుత్వం కేటాయించిన రూ.4.15 లక్షల నిధులను జిల్లా విద్యాశాఖ అధికారులు పక్కదారి పట్టించారు.

నిఘా

జిల్లాలో రెమిడియల్ తరగతుల కోసం విద్యాశాఖ అధికారులు రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో ఒకటి వరంగల్ కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ఉన్నత పాఠశాల, రెండోది నర్సంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల. మే 12 నుంచి జూన్ 3వ తేదీ వరకు విద్యార్థులకు తరగతులు నిర్వహించారు.

రూపాయి ఇవ్వలేదు..

“చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థి గణితం, సైన్స్‌లో ఫెయిల్ అయ్యాడు. నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. పది సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై.. ప్రస్తుతం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాడు. రూ.1000 ఇస్తామని చెప్పి నేటి వరకు చెల్లించలేదని వాపోయాడు.”

వివరాలు తీసుకున్నారు..

“వరంగల్ మండలానికి చెందిన ఓ విద్యార్థి గణితంలో తప్పాడు. కాశీబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రెమిడియల్ తరగతులకు హాజరయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు. 'ప్రభుత్వం నుంచి మీకు రూ.1000 వస్తాయని పాఠశాల సిబ్బంది బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు చెల్లించలేదు. దీనిపై అడిగితే స్పందించడం లేదని' విద్యార్థి తండ్రి తెలిపారు.”

రూ.4.15 లక్షలు స్వాహా..

జిల్లా నుంచి పరీక్షలకు హాజరైన 378 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1100 చొప్పున రూ.4,15,800 లను ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారి ఖాతాలో జమ చేసింది. డీఈవో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి.. వారి ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సింది. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా.. రూపాయి చెల్లించలేదు.

ఆరోపణలు వస్తున్నా..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో పనిచేసే కొంతమంది అధికార, సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే విమర్శలున్నాయి. కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల నుంచి ప్రతి పనికి కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి జిల్లా విద్యాశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విద్యా బలోపేతానికి బాటలు

● జవాబు పత్రాల మూల్యాంకనలో కొత్త విధానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనలో పాఠశాల విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో సబ్జెక్టులపై పట్టులేని విద్యార్థులను ముందే గుర్తించి, వారికి మెరుగైన విద్యనందించే లక్ష్యంతో 'ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టమ్' పేరుతో ఈ విధానాన్ని రూపొందించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేయగా, ఇది ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలులోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.


తరగతి గదిలో విద్యార్థులు

ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో..

పరీక్ష పూర్తి కాగానే సమాధాన పత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ) ఎంఈవోకు అప్పగిస్తారు. అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు జవాబుపత్రాల మూల్యాంకనం చేస్తారు. ఈ మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అయితే సొంత పాఠశాలలకు చెందిన జవాబుపత్రాలను దిద్దడానికి, మార్కులు కేటాయించే అవకాశం ఉండదు. సమాధాన పత్రాలు మూల్యాంకనం చేసి, మూడు నుంచి ఐదు రోజుల లోపు మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో జవాబుపత్రానికి రూ.2, 7, 8, 9 తరగతుల సమాధాన పత్రాలకు రూ.3 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

ఉమ్మడి జిల్లా గణాంకాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
భూపాలపల్లి	414	18,970
మహబూబాబాద్	762	40,109
ములుగు	473	18,410
హనుమకొండ	492	30,763
జనగామ	408	29,837
వరంగల్	724	32,661

ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి..

ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సహా అన్ని సౌకర్యాలు కల్పించాలి. పరీక్షలు నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించి జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదు చేసి, ఎమ్మార్సీలో అప్పగించడం ఆయా పాఠశాలల హెచ్ఎంలదే పూర్తి బాధ్యత. పాఠశాలల నుంచి వచ్చిన సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకుని, రిజిస్టర్‌లో నమోదు చేసి, జవాబుపత్రాలు జాగ్రత్తగా భద్రపర్చడం మండల విద్యాశాఖ అధికారి బాధ్యత. ఆన్‌లైన్‌లో నమోదు సకాలంలో జరిగే విధంగా ఎంఈవోలు చూసుకోవాలి. ఈ కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్షించాలి.


కాజీపేట పురవీధుల్లో రథయాత్ర ఎదుట పోతురాజుల నృత్యం

ఘనంగా పోచమ్మ రథయాత్ర

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట బాపూజీ నగర్‌లో పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకుడు కొండ్ర నర్సింగరావు ఇంటి నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిమను పొట్టేళ్లతో ఏర్పాటు చేసిన రథంలో ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ రథయాత్రను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన పోతురాజుల నృత్యాలతో పోచమ్మ తల్లిని కాజీపేట పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, జక్కుల రవీందర్ యాదవ్, నార్లగిరి రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసూళ్లపై శ్రద్ధ.. భద్రతపై నిర్లక్ష్యం

ఈనాడు పరిశీలన

కాటారం, న్యూస్‌టుడే: 353సీ జాతీయ రహదారిపై కాటారం-భూపాలపల్లి మధ్యలో మేడిపల్లి వద్ద గత రెండేళ్ల క్రితం టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. టోల్ ఫీజు వసూలుపై పెడుతున్న శ్రద్ధ వాహనదారుల భద్రత, మౌలిక వసతుల కల్పనపై లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నా..: జాతీయ రహదారి మార్గంలో అధికంగా ఇసుక, బొగ్గు లారీలతో పాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి రవాణా వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తాయి. దీంతో రహదారి దెబ్బతిని, పలుచోట్ల గుంతలు పడ్డాయి. వాహనదారుల ఆందోళనతో ఇటీవల తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా మళ్లీ పరిస్థితులు మొదటికొచ్చాయి. దీంతో వాహనదారులు అధిక సంఖ్యలో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి కారణాలను విశ్లేషించి, రహదారి లోపాలు ఉంటే సరిచేయాలి. రహదారిపై గుంతలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలి. వర్షాలతో రహదారి దెబ్బతింటే వెంటనే పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. కానీ ఇవేమి టోల్‌ప్లాజా పరిధిలో కానరావడం లేదు. దీంతో వాహనదారులు ఆందోళన చేపడుతున్నారు.


మేడిపల్లి వద్ద టోల్‌ప్లాజా

సౌకర్యాలు కరవు..

రోజుకు సగటున ఈ టోల్‌ప్లాజా ద్వారా వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ప్లాజా వద్ద వాహనదారుల కోసం తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు లేవు. టోల్‌ప్లాజా నిర్మాణంతో సమీప ఇళ్లలోకి మురుగునీరు చేరుతుండడంతో ఇటీవల కార్యదర్శి నోటీసులు అందజేశారు. టోల్‌ప్లాజా సమీపంలోనే ఇరువైపులా రహదారి దెబ్బతిని గుంతలు పడ్డాయి. జాతీయ రహదారిపై ఇరువైపులా, డివైడర్ మధ్యలో సుందరీకరణ ఊసే లేక అధ్వానంగా ఉంది.


టోల్ ప్లాజా సమీపంలో దెబ్బతిన్న జాతీయ రహదారి

ఇప్పటికైనా ప్లాజా నిర్వాహకులు రహదారి మరమ్మతులు చేపట్టడంతో పాటు వాహనదారులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


అసమానతలపై అక్షర యుద్ధం

● పుస్తక రచనలో యువకులు

యువ

భీమారం, న్యూస్‌టుడే: మనసులోని భావాలకు అక్షర రూపం ఇస్తూ పుస్తక రచనకు పునాది వేసుకున్నారు. చదువు, ఉద్యోగం చేస్తూనే సమాజంలోని వివిధ సామాజిక, ఆర్థిక అసమానతలను తమ అక్షరంతో ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం కలిగేలా ముందుకు సాగుతున్నారు. పుస్తక రచనలతో ఈ యువకులు పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు.


అన్యాయాలకు వ్యతిరేకంగా 'దుసుముడి'



- వనపాకల దిలీప్

నా చుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని, అసమానతలను ప్రశ్నించకుండా ఉండలేకపోయా. అవమానకర సన్నివేశాలు, రాజకీయ నాయకుల చర్యలపై స్పందిస్తూ నా అంతః సంఘర్షణలను తెలపడానికి కవిత్వం నాకో మార్గమైంది. అందుకే నేను రాసిన 'దుసుముడి' కవితా సంపుటిలో పదేళ్లలో దేశంలో జరిగిన ఘటనలు కళ్లముందు కనిపిస్తాయి. మనుషులను ప్రేమించేవారే.. అందరూ సమానంగా ఉండాలని కోరుకుంటారు. నా కవిత్వంలో కూడా అన్యాయాలను, అవమానాలను వ్యతిరేకించే కోణంతోపాటు మనుషులను ప్రేమించడం కూడా బలంగా కనిపిస్తుంది.

నా స్పందనల నుంచి 'పిలుపు'



- అమృతరాజు

పితృస్వామ్యం, భూస్వామ్య విధానాలతో అన్ని వర్గాల ప్రజలు పీడింపబడుతున్నారు. అందుకే అంబేడ్కర్, జ్యోతిరావు పులే ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను కవిత్వంతో చైతన్యం చేయాలనుకున్నాను. సొంతంగా కరపత్రాలు రాసుకుని చర్చల్లో పాల్గొంటూ నా అభిప్రాయాలను పంచుకోవడంతో సాహిత్య రచన మొదలుపెట్టా. కరోనా సమయంలో ప్రజలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ పాలకులు ప్రజలను హింసించడం ఆపలేదు. 2015 నుంచి 2023 వరకు జరిగిన కొన్ని ఘటనలకు నా స్పందనలను మలిచి 'పిలుపు' పుస్తకాన్ని రాశాను.

బాధితులకు అండగా 'నీలం రంగు నది'



- హాథీరామ్ సభావట్

జన్మనిచ్చిన తల్లిని కోల్పోయాక బాల్యమంతా హాస్టల్‌లోనే గడిపాను. జీవితంలో పొందిన ఒంటరితనాన్ని పోగొట్టుకునేందుకు నాలో నేను చెప్పుకోవాలనుకున్న భావాలను అక్షరాలుగా రాసుకున్నాను. నా హైస్కూల్ టీచర్ నాగార్జున ద్వారా పలు కవితల గురించి తెలుసుకుని ఓనమాలు నేర్చుకున్నాను. కేయూలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పూర్తి చేశాను. కవిత్వాన్ని సమాజపరం చేయాలని, బాధితుల వైపు నిల్చుండాలన్న ఆలోచనలతో రాయడం మొదలుపెట్టాను. నా వ్యక్తిగత, తండా జీవితాన్ని కలగలిపి 'నల్లింకు పెన్ను'గా రాశాను. ఆ తర్వాత వచ్చిన 'నీలం రంగు నది' ఆదివాసి యుద్ధం నుంచి పాలస్తీనా యుద్ధం వరకు బాధితుల వైపు నిల్చుంటుంది.

వైరల్ జ్వరం

● అప్రమత్తతతో అరికట్టవచ్చంటున్న వైద్యాధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా జ్వర బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రజలను వదలడం లేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న చిరు జల్లులతో ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, తాగునీరు, ఇతర తినే పదార్థాలు కలుషితం కావడం, దోమలు అభివృద్ధి చెందడంతో ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే జ్వరాల నుంచి బయటపడవచ్చని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెరుగుతున్న ఓపీ

జిల్లా వ్యాప్తంగా 13 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు 90 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. వాటి ద్వారా నిత్యం ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పీహెచ్‌సీల్లో ఓపీ పెరుగుతోందని వైద్యాధికారులు తెలుపుతున్నారు. గతంలో 30 నుంచి 40 వరకు ఉన్న ఓపీ గత కొన్ని రోజులుగా నిత్యం 80 నుంచి 100కి పైగా వస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అందుకు అనుగుణంగా వైద్యాధికారులు, సిబ్బంది పీహెచ్‌సీలల్లో అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు.

90శాతం వైరల్ ఫీవర్లు..

ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాలలో 90 శాతం వైరల్ ఫీవర్‌లే ఉంటున్నాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యాధికారులు తెలుపుతున్నారు. అలాగే ఈగలు వృద్ధి చెంది మనం తీసుకునే ఆహార పదార్థాలపై వాలుతుండటంతో వాటి ద్వారా కూడా జ్వరాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. జులై నుంచి ఆగస్టు మాసం వరకు 320 పైనే వైద్యశిబిరాలను నిర్వహించగా సుమారు 630 మంది జ్వర బాధితులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

డెంగీ 12, మలేరియా 7

జిల్లా వ్యాప్తంగా 13 పీహెచ్‌సీలు ఉండగా ఒక అర్బన్ హెల్త్ సెంటర్, రెండు సీహెచ్‌సీలతో పాటు జిల్లా జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. వీటి ద్వారా జ్వర బాధితులకు ఎప్పటికప్పుడు చికిత్స అందిస్తున్నారు. ఈ సంవత్సరం డెంగీ కేసులు 12 నమోదు కాగా, మలేరియా 7 కేసులు నమోదైనట్లు అధికారులు తెలుపుతున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యాధికారులు తెలుపుతున్నారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

మల్హర్, న్యూస్‌టుడే: రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మల్హర్ మండల కొయ్యూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. మంథని నియోజకవర్గంలోని ఐదు మండలాలకు కాటారంలో ఒకటే కేంద్రం ఉండటంతో కాలిపోయిన మోటార్లు మరమ్మతు కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. గత సీజనల్‌లో ఒకేసారి వంద ట్రాన్స్‌ఫార్మర్లు రావడంతో మరమ్మతుల్లో జాప్యం నెలకొందన్నారు. పంటల సాగులో ఎలాంటి సమస్యలు లేకుండా ఇక్కడ నెలకొల్పామని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు కాటారానికి వెళ్లకుండా దూరభారం తగ్గిందన్నారు. మండల ప్రజల చిరకాల స్వప్నమైన తాడిచెర్ల నుంచి భూపాలపల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. హ్యామ్ పథకంలో కొత్తగా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. మల్లారం క్రాస్ నుంచి పెద్దతూండ్ల రోడ్డుకు త్వరలో నిధులు కేటాయించనున్నామని స్పష్టం చేశారు. తాడిచెర్ల ఉపరితల గని డేంజర్ జోన్ భూనిర్వాసితులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి పరిహారం చెల్లించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాష్‌రెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేశ్, సర్పంచులు రాజమ్మ, శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజబాబు, సింగిల్‌విండో ఛైర్మన్ మొండయ్య, రాజిరెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు. అనంతరం కొయ్యూర్‌లో పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు.


ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

గ్యాస్‌కు కొత్త భారం

మరిపెడ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఎల్పీజీ వినియోగం భారీగా పెరిగింది. గ్యాస్ కొత్త కనెక్షన్ తీసుకోవడం, సిలిండర్ రీఫిల్ చేయడం, డెలివరీ ఛార్జీల వంటి అంశాలు సామాన్య కుటుంబాలకు భారంగా మారింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ ఖర్చుల్లో గ్యాస్ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ కొరత, సిలిండర్ బుకింగ్ గడువు పెంపు ప్రభావంతో కొత్త కనెక్షన్ దరఖాస్తులు పెరిగేందుకు దారి తీసింది. మార్చి నుంచి చమురు సంస్థలు కొత్త కనెక్షన్ల జారీ ప్రక్రియ నిలిపివేశాయి.

గతంలో ఒక్క రోజులోనే..

వంటగ్యాస్ కనెక్షన్ల కోసం గతంలో దరఖాస్తు చేసిన ఒక్క రోజులోనే కొత్త దానితోపాటు డబుల్ సిలిండర్ సైతం ఇచ్చేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు తగ్గినా ఆ ప్రభావం గ్యాస్ సరఫరాపై కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా నూతన గ్యాస్ కనెక్షన్లు, రెండో సిలిండరు మంజూరు నిలిపివేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. నూతన కనెక్షన్ మంజూరు చేయాలని గృహావసరాల వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయాల్లో అర్జీలు సమర్పిస్తున్నారు. వీరందరికీ నాలుగు నెలలుగా వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో నిరీక్షణే మిగిలింది.


మరిపెడలో గ్యాస్ రీఫిల్ కోసం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 13.88 లక్షలు

మహబూబాబాద్, వరంగల్ హనుమకొండ, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలో మొత్తం 13.88 లక్షల ఎల్పీజీ కనెక్షన్లున్నాయి. జిల్లాల వారీగా చూస్తే హన్మకొండ జిల్లాలో అత్యధికంగా 4.35 లక్షల వినియోగదారులున్నారు.

షట్లర్ కీర్తికి రజత పతకం



వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు యువ సంచలనం షట్లర్ కీర్తి రజత పతకంతో అదరగొట్టింది. ఈ నెల 25 నుంచి 30 వరకు మహారాష్ట్రలో పుణె అంతర్జాతీయ (గ్రాండ్ ప్రిక్స్) బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగిన మంచాల కీర్తి అద్భుతమైన ప్రదర్శనతో థాయిలాండ్ జట్టుపై రన్నరప్‌గా నిలిచింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న కీర్తిని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు డా. రమేశ్‌కుమార్, పింగిళి రమేశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య విద్యార్థుల సేవార్థ్



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య విద్యార్థులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడంతో పాటు ఖాళీ సమయంలో సామాజిక సేవ చేస్తున్నారు పలువురు వైద్య విద్యార్థులు. కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ) విద్యార్థులు రక్తదానం పై 'బ్లడ్ డోనర్స్ క్లబ్', గ్రామీణుల ఆరోగ్య సమాచారం, 'సేవక కేంద్రం', 'గ్రామాల దత్తత', ఏజెన్సీ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించడం కోసం 'ఆరోగ్య మిత్ర యాత్ర' పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 'సేవార్థ్ క్లబ్' పేరిట ఏడాది పొడవునా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. గతేడాది ఫైనలియర్ విద్యార్థులు ఈ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు ఉత్సాహంగా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

ముఖ్యోద్దేశం ఇదీ..

సమాజంలో అపోహలు, మూఢ నమ్మకాలు పోగొట్టాలనే దృఢ నిశ్చయంతో 'సేవార్థ్' కార్యక్రమం నిర్వహించడానికి సమాయత్తమైంది. వాస్తవ పరిస్థితులు తరగతి గదులలో, ఆసుపత్రుల్లో పరిమితం కాకుండా సమాజం ముందుంచడానికి ఈ క్లబ్ సభ్యులు కృషి చేస్తున్నారు. శాస్త్రీయమైన వైద్య సమాచారం సామాన్య ప్రజలకు చేరవేయడం, అపోహలను తొలగించడం, ఆరోగ్యంపై సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రజలను చైతన్య పరచి, అవసరమైన వారికి అండగా నిలవడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం.

కార్యవర్గం ఎవరెవరంటే..

సేవార్థ్ క్లబ్ అధ్యక్షుడిగా ఆర్‌కే.శ్రీరాంరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కె.సాహితి, ప్రధాన కార్యదర్శులుగా టి.వంశీ, పి.దీప్తి, కోశాధికారిగా సందీప్ పాటిల్, సోషల్ మీడియా బాధ్యులుగా జయానంద్, సభ్యులుగా ఉపన్య, అలీ, ఆకాంక్ష, శ్రీజ, సేవారెడ్డి, నీరజ్, శ్రీశైలం ఉన్నారు. గతేడాది సేవార్థ్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలిగా అనన్య, కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా హేమాంగిని, రామకృష్ణ పనిచేశారు.

మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం..



సమయం దొరికినప్పుడల్లా సమాజాన్ని చైతన్యపర్చే కార్యక్రమాలు చేపట్టుకుంటున్నాం. ఆరోగ్యపరమైన విషయాల్లో ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉంది. అపోహలను తొలగింపోయేలా మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

– ఆర్‌కే.శ్రీరాంరెడ్డి 'సేవార్థ్ క్లబ్' అధ్యక్షుడు

చేపట్టిన కార్యక్రమాలు..: ☛ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు విద్యార్థులకు నీడిక సన్నద్ధమయ్యే విధానం, పరిశ్రమ భయం పోగొట్టేలా కార్యక్రమాలు నిర్వహణ. ☛ 2025 ఆగస్టు 30న ఒక్కరోజే 9 పాఠశాలల్లో 470 మంది విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ. ☛ 5 ఆగస్టు 2025న వరల్డ్ బ్రెస్ట్‌ఫీడింగ్ వీక్ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తూ.. 300 మంది విద్యార్థులతో 'హెల్త్ రన్' కార్యక్రమం. ☛ కొంతమంది విద్యార్థులకు ఆరోగ్య కార్యశాలలు 2025 జూన్ 27న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 19 జూన్ 2025న, 18 జులై 2026న ప్రైవేటు విద్యా సంస్థలో చేపట్టారు. ☛ 6 ఆగస్టు 2026 రోజున ఎమర్జెన్సీ మెడికల్ అవేర్‌నెస్ కార్యక్రమం వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. రైల్వే సిబ్బందికి, పోలీసులు, కూలీలకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.

ఆలయ సమాచారం

✦ భద్రకాళి ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీభద్రేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి. ✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణ మాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి. ✦ హనుమకొండలోని చారిత్రక పద్మాక్షి దేవాలయంలో శ్రావణ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5:00 గంటలకు పరివార దేవతామూర్తులకు అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చనలు, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6:30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుంది. ✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 గంటలకు రూ.1000ల ప్రత్యేక అభిషేకాలు, 10.30కు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకులచే త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం ఉంటుంది.

– న్యూస్‌టుడే, రంగంపేట, హనుమకొండ సాంస్కృతికం, కాళేశ్వరం

గోదావరిలో 'పెద్ది' అస్థికల నిమజ్జనం



సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న నాయకులు

భద్రాచలం, న్యూస్‌టుడే: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్థికలను ఆదివారం భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఆ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అస్థికలను నదిలో కలిపారు. దీనికి ముందు స్నానాల ఘాట్‌లో పురోహిత సంఘం అధ్యక్షుడు రామావఝుల రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానికంగా ఉన్న ఓ సత్రంలో సంతాప సభను నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి స్వప్న, కుమారుడు నిరుద్ర్‌రెడ్డి, కుమార్తె దృష్టిరెడ్డితో పాటు నాయకులు నివాళులర్పించారు. గత నెల 31న సుదర్శన్‌రెడ్డి మృతి చెందారని.. అతడి మరణం తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమ కెరటంగా పోరాటం సాగించారని, భారాసలో కీలక నేతగా ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు.

ఉన్నత విద్యకు ఉపకార వేతనం

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులు 12వ తరగతి అనంతరం ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సాయానికి కేంద్ర ప్రభుత్వం టాప్ క్లాస్ పథకం కింద ఉపకార వేతనాన్ని అందిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరంలో దాదాపు 2,000 మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యా ఖర్చులు పుస్తకాలు, స్టేషనరీ, ల్యాప్‌టాప్ తదితర అవసరాల కోసం మొదటి ఏడాది రూ.86 వేలు, తర్వాత ప్రతి ఏడాది రూ.41 వేలు చొప్పున అందిస్తారు. ప్రైవేటు విద్యా సంస్థలో ట్యూషన్ ఫీజుతోపాటు ఇతర ఫీజులు కూడా పూర్తిగా చెల్లిస్తారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్ పథకం

అర్హతలు

✦ ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. ✦ కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి రూ.8 లక్షల వరకు ఉండాలి. ✦ గుర్తింపు పొందిన సంస్థలో రెగ్యులర్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ✦ మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ✦ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. 30 శాతం బాలికలకు కేటాయించారు.

దరఖాస్తు విధానం

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం, ఎయిమ్స్‌లో తదితర వంటి ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొంది ఉండాలి. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ప్రవేశ ర్యాంకు, ఫీజు వివరాలను పొందుపర్చాలి.

ముఖ్యమైన అంశాలు

☛ ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర ఉపకార వేతనాలు పొందుతున్నవారు అనర్హులు ☛ విద్యార్థి తదుపరి తరగతికి ప్రమోట్ కాకపోతే ఉపకార వేతనం నిలిపివేస్తారు. ☛ దరఖాస్తుకు చివరి తేదీ: 2026 అక్టోబరు 31.

రామప్ప శిల్పకళ అద్భుతం



శిల్పకళను తిలకిస్తున్న ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్‌రెడ్డి

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణ చాతుర్యం, శిల్పకళా సంపద అణువణువూ అద్భుతమేనని ఏటూరునాగారం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా రామప్పను సందర్శించారు. పూజారులు స్వాగతం పలికి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. జర్మనీకి చెందిన ముగ్గురు పర్యాటకులు సందర్శించారు. రామప్ప పరిసరాల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. సరస్సులో బోటు షికారు చేశారు. వారివెంట ఆలయ ఈవో భాస్కర్, పురావస్తు, పర్యాటక, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం



ముత్తారంలో రహదారి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలంలో 'పల్లెపల్లెలో పొన్నమన్న... పల్లెపల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్, వీరభద్రనగర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముత్తారం-లంబాడి తండా-గట్లనర్సింగాపూర్ రహదారి అభివృద్ధికి రూ.3.74 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, స్టీల్ బ్యాంకులను వినియోగించాలన్నారు. సౌర విద్యుత్తును ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం నా బాధ్యత అని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు. గొల్లపల్లి బస్‌స్టేషన్ నుంచి ముత్తారం వరకు రూ.3.5 కోట్లతో తారు రోడ్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. వీరభద్రనగర్ పంచాయతీకి స్థలం ఇస్తే భవనానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, ఏడీఏ ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచులు ఊరడి భారతి, నేతల చంద్రమోహన్, గడ్డం సుజాత, కొర్ర గోపాల్, బొల్లంపల్లి అజయ్, బొల్లి మాసన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేశ్ పాల్గొన్నారు.

రూ.కోట్లతో నిర్మించి.. కొనుగోళ్లు మరిచి!



నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డు

పర్వతగిరి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే: అన్నదాతలు పంటలు విక్రయించుకోవడానికి నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదని సకల సౌకర్యాలతో పర్వతగిరి మండల కేంద్రంలో 1995లో అతిథి గృహంతో పాటు ధాన్యం, పత్తి, పసుపు ఆరబోసేందుకు షెడ్లు, గోదాంలు నిర్మించారు. వ్యవసాయ సబ్ మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు ధాన్యం తదితర పంటలను తీసుకురావడం లేదు. దీంతో రూ.కోట్లతో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రారంభించిన కొత్తలో అరకొరగా కొనుగోళ్లు నిర్వహించిన మార్కెట్ అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు. ప్రతి సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, ప్రాథమిక సహకారం సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో 15 రోజుల పాటు రైతులతో కొంత సందడి నెలకొంటుంది. అనంతరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొనుగోలు, అమ్మకాలు లేని సబ్ మార్కెట్‌లో 2015లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంతో పాటు ప్రత్యేక నిధులతో కళాతోరణం నిర్మించారు.

బొగతలో పర్యాటకుల సందడి



వాజేడు, న్యూస్‌టుడే: పర్యాటకుల కేరింతలతో బొగత జలపాతం సందడిగా మారింది. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం పరవళ్లు తిలకిస్తూ.. ఈత కొలనులో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఓవైపు చిరుజల్లులు, మరోవైపు జలపాతం నీటి తుంపరలతో పర్యాటకులు తడిసి ముద్దయ్యారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేందుకు చలో దిల్లీ



దిల్లీకి తరలివెళ్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు బృందం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చలో దిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సెప్టెంబరు 1న న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) మహా సభకు హనుమకొండ జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరారు. కాజీపేట రైల్వే జంక్షన్ ఎదుట శ్రీనివాస్‌రావు జెండా ఊపి పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, నేదునూరి జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, భిక్షపతి, మద్దెల ఎల్లేష్, స్టాలిన్, రాజమౌళి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హనుమకొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశం సంఘం బాధ్యులు మండల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు జీరో పద్దు కింద వేతనాలు అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.పట్టాభి, రవీందర్‌రెడ్డి, మహేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రినగరి

యువత క్రీడల్లో రాణించాలి



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు సైక్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన పలు క్రీడాంశాల్లో విజేతలకు ముఖ్య అతిథిగా ప్రభాకర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారుల తమ లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీవైఎస్‌వో కొత్త ప్రశాంత్, జూడో సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్యామల పవన్, డీఎస్ఏ కోచ్‌లు ప్రభుదాస్, రమేశ్, నవీన్, విష్ణువర్ధన్, జీవన్ పాల్గొన్నారు.

కనకదుర్గ కాలనీ పార్కు అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ డా.కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: హనుమకొండ 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలోని జీడబ్ల్యూఎంసీ పార్కు, కమ్యూనిటీ కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తామని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వారు పార్కును సందర్శించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాకర్స్, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలం, మెరుగైన ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, మహిళలు, యువత కోసం ధ్యానం హాలు, మెరుగైన ఓపెన్‌జిమ్, పటిష్ఠమైన లైటింగ్, భద్రతకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్, మున్సిపల్ అధికారులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు కోరారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 33, 39 డివిజన్ల పరిధిలో ఆదివారం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	117
రిటైల్:	144
డ్రెస్డ్:	223
స్కిన్‌లెస్:	252

రాఖీ పండగకు మేనమామ ఇంటికి వచ్చి..

కుంటలో పడి అన్నదమ్ముల మృత్యువాత



వినయ్ కిశోర్



రాజేశ్

ములుగు క్రైం, న్యూస్‌టుడే: రాఖీ పండగకు అమ్మతో కలిసి మేనమామ ఇంటికి వచ్చిన అన్నదమ్ములు నీటి కుంటలో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోతు స్వాతి-యాకూబ్ దంపతులకు ఇద్దరు కుమారులు. వినయ్ కిశోర్ (16) మంగపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, రాజేశ్ (14) కమలాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రాఖీ పండగ కోసం ఈ నెల 28వ తేదీన తల్లి స్వాతితో కలిసి ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లిలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చారు. స్వాతి తన సోదరుడు గణేశ్‌కు రాఖీ కట్టి. . కుమారులను మరుసటి రోజున రమ్మని చెప్పి శనివారం వెళ్లిపోయారు. మేనమామ ఇంటి వద్ద ఉన్న వినయ్ కిశోర్, రాజేశ్‌తో పాటు మరో బాలుడు సాయి కలిసి ఆదివారం గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమి కోసం శివారులో ఉన్న మొండికుంట వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన అన్న వినయ్ కిశోర్ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. అతడిని కాపాడేందుకు తమ్ముడు రాజేశ్ చేయి అందిస్తూ అతనూ నీళ్లలో పడి పోయాడు. వారివెంట ఉన్న మరో బాలుడు సాయి పరుగున గ్రామంలోకి వెళ్లి చెప్పడంతో బంధువులు, గ్రామస్థులు కుంట వద్దకు చేరుకొని గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఎస్సై రచిత్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మేనమామ గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పృహ కోల్పోయిన తల్లి..: కమలాపూర్‌లో ఉన్న తల్లి స్వాతి కుమారుల మరణవార్త విని కన్నీరుమున్నీరుగా విలపించారు. రాత్రికి ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. తన కుమారులకు ఏమైందంటూ రోదించారు. స్పృహ కోల్పోవడంతో బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

వేధింపులతో మహిళ ఆత్మహత్య

ఇద్దరిపై కేసు నమోదు



రాజేశ్వరి

వాజేడు, న్యూస్‌టుడే: ఇద్దరు వ్యక్తుల వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకొంది. పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాట రాజేశ్వరి (26)ని అదే గ్రామానికి చెందిన కాట నవీన్, కావిరి రాజు వేధించేవారు. ఓ కేసు విషయంలో జైలుకు వెళ్లిన ఆమె భర్త ఇక బయటకు రాడని, తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ నిత్యం ఫోన్ చేసి బెదిరించేవారు. వారి నంబర్లు బ్లాక్ చేస్తే ఇతర నంబర్ల ద్వారా ఫోన్లు చేశారు. ఇంటి ముందు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. వారి వేధింపులు భరించలేక ఆమె ఈ నెల 26వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారి వేధింపులు భరించలేకే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. తనకు చిన్న కుమారుడు ఉన్నాడని, తనను వేధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్ ద్వారా పంపిన వీడియో వివరాలు వెల్లడించారు. మృతురాలి తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు నిందితులు కాట నవీన్, కావిరి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రవిచంద్ర

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం. . హనుమకొండకు చెందిన వేముల రవిచంద్ర (25) బండ్లగూడలో ఉంటూ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1:30 సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ వాహన డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి.. టిప్పర్ వెనక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై జనగామ మండలం పెంబర్తి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. జనగామ ఎస్సై చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన గుండ మల్లమ్మ, మల్లయ్య దంపతులు పెంబర్తి యూ-టర్న్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుకాలే నుంచి ఓ ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో మల్లమ్మ(50) తలకు, మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ మృతిచెందారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మసాగర్, న్యూస్‌టుడే: కాజీపేటకు చెందిన చంద బుచ్చయ్య (65) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మసాగర్ ఎస్సై దిలీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కాజీపేటకు చెందిన బుచ్చయ్య మద్యానికి బానిసై శనివారం సాయంత్రం తన ఇంట్లో వారితో ఘర్షణ పడి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బుచ్చయ్య కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కళాకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి


కళాకారుడికి గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కళాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం కట్టుబడి ఉందని, వారికి పలు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో తెలంగాణ జానపద కళాకారుల కృతజ్ఞత సభ ఆదివారం నిర్వహించారు. కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి నుంచి క్రీడా మైదానం వరకు కళాకారులు సంప్రదాయ వాయిద్యాలతో పాటలు పాడుకుంటూ, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ..తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కళాకారుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు అందించడం ద్వారా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పుర ఛైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ ఛైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కిష్టయ్య, సీనియర్ కళాకారుడు కె.సంజీవరావు, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

బోధన ఎలా సాగుతోంది..!

నేటి నుంచి పాఠశాలలకు తనిఖీ బృందాలు

మానుకోట, న్యూస్‌టుడే: విద్యావిషయక అంశాల అమలు, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించేందుకు ఉపాధ్యాయులతో కూడిన తనిఖీ బృందాలు సోమవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించనున్నాయి. ప్రాథమిక పాఠశాలల తనిఖీకి ఆరు బృందాలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఒక బృందం ఆయా పాఠశాల సముదాయాల పరిధిలో ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో నోడల్ అధికారితో పాటు మరో ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో కలిపి మొత్తం ముగ్గురు సభ్యులుంటారు. ప్రాథమిక పాఠశాలల బృందానికి నోడల్ అధికారిగా ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, యూపీఎస్ బృందానికి ఓ స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈ బృందాలు జిల్లాలోని 559 ప్రాథమిక, 77 యూపీఎస్‌లను తనిఖీ చేస్తాయి.

పూర్తిస్థాయిలో బాధ్యతలు

ఈ బృందాల్లోని ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బాధ్యతలను నిర్వర్తించాలి. వారు పనిచేసే పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. బృందంలోని ప్రతి సభ్యుడికి జిల్లా పర్యవేక్షణ అధికారి (ఏఎంఓ) కొన్ని పాఠశాలలను కేటాయిస్తారు. ఆ పాఠశాలలను సందర్శిస్తూ బృందంతో సమన్వయం చేసుకోవాలి. పాఠశాలల్లో కనీసం రెండు సబ్జెక్టుల బోధనను పరిశీలించి తెలంగాణ పాఠశాల విద్య యాప్‌లో నమోదు చేయాలి.

ఎఫ్‌ఎల్‌ఎన్ అమలుపై ప్రత్యేక దృష్టి

పాఠశాలల్లో తొలిమెట్టు పేరిట అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంపై తనిఖీ బృందాలు ప్రధానంగా దృష్టి పెడతాయని ఏఎంఓ మోత్కూరి వెంకటేశ్వర్లు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. ప్రాథమిక తరగతుల్లో బోధన, ప్లానింగ్, టీఎల్ఎం వినియోగం, వర్క్‌షీట్లతో సాధన చేయిస్తున్నారా? తదితర అంశాలపై సమగ్ర పరిశీలన జరగనుంది. ఈ మేరకు తనిఖీ బృందాలకు సమగ్రమైన ప్రశ్నావళిని అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో తాగునీటి బోర్ ప్రాంతంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. – శ్రీనివాస్, రాజీవ్‌నగర్ కాలనీ

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి చర్యలు తీసుకుంటాం. – కె.యుగేందర్, వార్డు కౌన్సిలర్

● మున్సిపాలిటీ పరిధిలోని కుందూరిపల్లి గ్రామంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో గత రెండు రోజులుగా తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నాయి. – విజేందర్, కుందూరుపల్లి

సమాధానం: తాగునీటి సరఫరా పర్యవేక్షించే కార్మికులకు పంపించి లీకేజీ అవుతున్న పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎ.కిషన్, వార్డు కౌన్సిలర్

మురుగు కాల్వలు శుభ్రం



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మొట్లపల్లి గ్రామంలోని యాదవకాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం..మీకుతోడుగా'కు వివరించారు. విషయాన్ని 'న్యూస్‌టుడే' సర్పంచి నరహరి వెంకట్‌రెడ్డికి వివరించగా ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు.

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలోని ప్రధాన దారిలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని, దుర్వాసన వస్తుందని స్థానికుడు వెంకట్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు వివరించారు. దీంతో సమస్యను 'న్యూస్‌టుడే' సర్పంచి గాదం శ్రీవాణికి వివరించగా ఆమె స్పందించారు. పంచాయతీ సిబ్బంది మురుగు కాల్వల్లోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

గ్రామ కమిటీల ఎన్నిక


విలాసాగర్ గ్రామ కమిటీ కార్యవర్గం

కాటారం, న్యూస్‌టుడే: విలాసాగర్, కొత్తపల్లి, మద్దులపల్లి గ్రామాల కాంగ్రెస్ కమిటీలను ఎన్నుకున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. విలాసాగర్ అధ్యక్షుడిగా పూసల శశికాంత్, ఉపాధ్యక్షుడిగా స్వామి, రాజసాగర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, యూత్ అధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు. కొత్తపల్లి గ్రామ అధ్యక్షుడిగా ఆజ్మీరా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా అజయ్, ప్రధాన కార్యదర్శిగా అభిషేక్ ఎన్నికయ్యారు. మద్దులపల్లి గ్రామ అధ్యక్షుడిగా మల్లారం మహేష్, గౌరవ అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రావణ్, సతీష్, ప్రధాన కార్యదర్శిగా స్వామి, రాజబాపులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ బాధ్యులు సమ్మయ్య, అశోక్, నాయకులు వంశవర్ధన్‌రావు, మాధవరెడ్డి, శ్రీహరి, మహేష్, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే డిమాండ్ల పరిష్కారం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి కార్మిక వర్గానికి సంబంధించిన భారీ ప్రయోజనాలు కల్పించేలా అగ్రిమెంట్ సాధించామని, 24 డిమాండ్లు తమ సంఘం పోరాట ఫలితంగానే సాధించినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం స్థానిక కొమురయ్య స్మారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఆర్థిక, ఉద్యోగ, వైద్య, విద్య, సంక్షేమానికి సంబంధించిన మొత్తం 24 అంశాలపై యాజమాన్యంతో సానుకూల ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు. 2009 నుంచి పెండింగ్‌లో ఉన్న పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రీఫండ్‌ను తాజా అగ్రిమెంట్‌లో సాధించామన్నారు. దీని వల్ల ఒక్కో కార్మికుడికి ఏడాదికి కనీసం రూ.35 వేల వరకు లాభం చేకూరుతుందని, ఈ మొత్తం 2027 ఏప్రిల్‌లో కార్మికులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. సహజ మరణం చెందిన కార్మిక కుటుంబాలకు అదనంగా రూ.20 లక్షలు అందించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన లాభాల్లో కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. మారు పేర్ల సమస్యకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశారని, 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్ల పునరుద్ధరణ, పెండింగ్ క్యాడర్ స్కీమ్‌ల అమలు, తదితర ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని యాజమాన్యం అంగీకరించిందని రాజ్‌కుమార్ తెలిపారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, ఐలయ్య, కరీముల్లా, రాజేందర్, శ్రీనివాస్, సదయ్య, కొమురయ్య, సతీష్, శ్యామ్, తిరుపతి, సాగర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో శాంతి ర్యాలీ



మహదేవపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మహదేవపూర్‌లో ముస్లింలు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవక్త ప్రవచనాలు ఆచరణీయమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోట రాజబాపు, సర్పంచి హసీనాభాను, పీఏసీఎస్ ఛైర్మన్ చల్ల తిరుపతి, మదీన మసీద్ కమిటీ అధ్యక్షుడు ముజాహిద్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కోట గుళ్లలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న సంగారెడ్డి డీఎంహెచ్‌వో దంపతులు

గణపురం, న్యూస్‌టుడే: కాకతీయుల కళాక్షేత్రం గణపురం కోట గుళ్లలో ఆదివారం సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డాక్టర్ రాజేశ్వరప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ఆదివారం పర్వదినం సందర్భంగా వైద్య దంపతులు గణపేశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు, చీర, సారె సమర్పించారు. అనంతరం ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో దంపతులను శాలువాతో సన్మానించారు.

దేవుడి పేరిట వసూళ్లు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేవుడి మొక్కులు చెల్లించే భక్తుల నుంచి కొందరు నగదు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. శ్రావణ మాసంలో నర్సంపేట పట్టణంలో అన్నివర్గాల ప్రజలు పోచమ్మ బోనాల వేడుకలు జరుపుతున్నారు. ప్రతి ఇంటి నుంచి బోనం తీసుకెళ్లి అమ్మవారికి బోనం నైవేద్యాలుగా పెట్టి ఎవరి శక్తి మేర వారు చీరలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. పట్టణంలో దాదాపు 60-70శాతం మంది వరంగల్ రోడ్డులోని పోచమ్మ గుడికి వచ్చి మొక్కులు చెల్లిస్తారు. అమ్మవారికి కోళ్లు, గొర్రెలతో చీరలు, వెండి ఆభరణాలతో మొక్కులు చెల్లించుకుంటారు. కోళ్లు కోసేందుకు రూ.20లు, గొర్రెలను కోసేందుకు ఒక్కో దానికి రూ.150-200 తీసుకుంటున్నారని కొందరు భక్తులు ఆరోపించారు. దేవుడి మొక్కులు సమర్పించేందుకు వెళ్తే నగదు వసూళ్లతో దోపిడీ చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఆలయం వద్ద అక్రమ వసూళ్లను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ కమిటీల ఎన్నిక


కమిటీతో మండలశాఖ అధ్యక్షుడు అశోక్

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో ఓటింగ్ పద్ధతిలో గ్రామశాఖ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా యస్‌కే షకీల్‌ను ఎన్నుకున్నారు. ఉపధ్యక్షులు బందెల శృతి, చిన్న మల్లయ్య, పెద్ది బాపు, ప్రధాన కార్యదర్శులు యస్‌డీ సమద్, కాటారం శేఖర్, పెద్ది లక్ష్మీ, కమటం వినోద, కోశాధికారి రవితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎన్నికను బహిష్కరించిన మరో వర్గం నాయకులు: కాళేశ్వరంలో మండలశాఖ అధ్యక్షుడు కట్కం అశోక్ ఆధ్వర్యంలో గ్రామశాఖ కమిటీ ఎంపిక కాగా మరో వర్గం కాంగ్రెస్ నాయకులు బహిష్కరించి బయటకు వచ్చినట్లు సంబంధిత నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, కమిటీ ఎన్నిక రద్దు చేయకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని ఓ ప్రకటనలో హెచ్చరించారు. కాగా కాళేశ్వరంలో కాంగ్రెస్ వర్గ పోరు రాజకీయాలు మొదలయ్యాయి.

మరమ్మతులకు నోచుకోని వాటర్ ప్లాంట్


పాండవుల గుట్టల్లో పని చేయని వాటర్ ప్లాంట్

రేగొండ, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యంతో పాండవుల గుట్టల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోవటం లేదని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. రేగొండ మండలం తిర్మలగిరి శివారులోని పాండవుల గుట్టల్లో పర్యాటకుల సౌకర్యార్థం 2018లో సుమారు రూ.3 లక్షలు వెచ్చించి అటవీశాఖకు చెందిన అధికారులు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఒక్క రూపాయితో సాధారణ, రూ.2 రూపాయిలు చెల్లిస్తే లీటరు చల్లటి నీళ్లు వచ్చేలా అధికారులు ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో విద్యుత్తు మోటార్‌లో చిన్న సమస్య తలెత్తడంతో అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఐదేళ్లలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు మారినా ఎవరూ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మూలకు పడిన ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని వన ప్రేమికులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారని వారికి ప్రతి నెల వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకుండా తక్కువ మొత్తంలో వారి ఖాతాలో జమ చేస్తున్నారని అవి కూడా నెల నెలా చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు పట్టుబడిన వాహనాలకు వేలం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేర్వేరు కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈ నెల 31న వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు సదరు వాహనానికి దారవత్తుగా 50 శాతం నగదు చెల్లించిన వారే వేలంలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుంది. వాహనాలను దక్కించుకున్న వారు అదే రోజు మిగితా సొమ్ము చెల్లించాలని సూచించారు. పనికిరాకుండా ఉన్న (స్క్రాప్) వాహనాలను, ముక్కలు, ముక్కలుగా కట్ చేసి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చిట్యాల, న్యూస్‌టుడే: ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు నిబంధనలు పాటించాలని చిట్యాల సీఐ సతీశ్ అన్నారు. చిట్యాల సర్కిల్ పరిధిలోని టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన ఇసుక ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక కోసం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడటం, ఇయర్‌ఫోన్లు పెట్టుకొని వాహనాలు నడపరాదన్నారు. ఇసుక రోడ్డుపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎస్సైలు అమూల్య, సతీశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

కాటారం, న్యూస్‌టుడే: జాదరావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఇటీవల పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించగా నూతన గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కోట అశోక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మండల కమిటీల నియామకం

టేకుమట్ల, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మచ్చ శ్రీకాంత్‌ను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పి.శంకర్, ఎంఎస్పీ మండలాధ్యక్షుడిగా మాదుగుల వీరయ్య, గౌరవ అధ్యక్షుడిగా అంబాల సారయ్య ఎన్నికైనట్లు చెప్పారు.

చిట్యాల, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ చిట్యాల మండలాధ్యక్షుడిగా కొల్లూరి అశోక్, ఎంఎస్పీ మండలాధ్యక్షుడిగా దొడ్డె శంకర్‌ను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి, జిల్లా ఇన్‌ఛార్జి మడిపల్లి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లిక్ చేసే ముందు ఆలోచించండి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై కుమారస్వామి

మహాముత్తారం, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణీయమైన ఆఫర్లు, బహుమతులు, ఉద్యోగాలు, రుణాలు, కేవైసీ అప్డేట్ పేరుతో పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని మహాముత్తారం ఏఎస్సై కుమారస్వామి సూచించారు. మండలంలోని యామన్‌పల్లి కూడలిలో సైబర్ నేరాల తగ్గింపే లక్ష్యంగా అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు పంపిన ఎపీకే ఫైల్స్, యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని కోరారు. మీ పేరుతో కేసు నమోదైందని, సిమ్ బ్లాక్ అవుతుందని, బ్యాంకు ఖాతా నిలిపివేస్తామని వచ్చే కాల్స్‌కు భయపడవద్దని అలాంటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డబ్బు పోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

సుభాష్‌కాలనీలో చోరీ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో తాళం వేసి ఉన్న కోడెపాక రమేష్‌బాబు అనే సింగరేణి ఉద్యోగి ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం.. రాఖీ పండగ సందర్భంగా రమేష్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఈ నెల 27న వరంగల్ జిల్లా రాయపర్తి గ్రామానికి వెళ్లారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆయన ఇంట్లో నుంచి కోతులు బయటకు వస్తున్న విషయాన్ని గమనించి, పక్కనే నివాసం ఉంటున్న వారు కొందరు అనుమానంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. ఇంటి తలుపు తీసి ఉండటంతో వెంటనే రమేష్‌బాబుకు ఫోన్ చేశారు. వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.ఐదు వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆ ఇంటి పక్కనే మరో గదిలో నివాసం ఉంటున్న పుల్ల సృజన్ అనే వ్యక్తి ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టారు. అతని ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవడంతో బీరువాలో ఉన్న వస్తువులను కిందపడేసి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పీజీ


తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ డా.సత్యశారద

లక్నేపల్లి (నర్సంపేట గ్రామీణం), న్యూస్‌టుడే: నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో జరిగిన నీట్ పీజీ నిర్వహణ కేంద్రాన్ని కలెక్టర్ డా.సత్యశారద ఆదివారం సందర్శించారు. ఇక్కడి పరీక్షా కేంద్రంలో మొత్తం 132 మంది విద్యార్థులకుగాను 127 మంది హాజరు కాగా, అయిదుగురు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ డీఆర్వో, విజయలక్ష్మి నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ ఉన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని 2003 డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శివగారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే 'చలో దిల్లీ'


వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి దిల్లీకి బయల్దేరిన సీపీఐ నాయకులు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, నిత్యావసర సరకుల ధరలు, ప్రజాస్వామ్య హక్కుల హననం, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే 'చలో దిల్లీ' కార్యక్రమం చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా తెలిపారు. సీపీఐ పిలుపు మేరకు సెప్టెంబరు ఒకటో తేదీన న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) సభలో పాల్గొనేందుకు ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తల బృందం దిల్లీకి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, విద్వేషపూరిత విధానాలతో కార్మికులు, కర్షకులు, యువత, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుండె బద్రి, చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, గోవర్ధనచారి పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు రూ.1.35 కోట్లు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: నూతన క్రీడా సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం క్రీడా క్యాలెండర్‌ను విడుదల చేసింది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించేందుకు రూ.1.35 కోట్ల నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి నవంబరు చివరి వారం వరకు 15 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని తెబొగకాసం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు లేఖ రాశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు 2023, డిసెంబరు 27న నిర్వహించారని, అదే రోజు ఫలితాలు ప్రకటించారన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు 2024, సెప్టెంబరు 9న అధికారిక పత్రాలు ఇచ్చారని వివరించారు. పదవీ కాలం పూర్తి కాగానే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని నాయకులు ఎం.రాజిరెడ్డి, టి.రాజా రెడ్డి కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రవీణ్‌యాదవ్

జనగామ రూరల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన జనగామ మండలం గానుగుపహాడ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రవీణ్‌యాదవ్(25) ఆర్ఎంపీగా కేశిరెడ్డిపల్లి (బచ్చన్నపేట మండలం)లో పని చేస్తున్నారు. గత గురువారం తమ బంధువులను నర్మెట్ట మండలం వెల్దండలో దిగబెట్టేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో జనగామ-మద్దూరు రహదారిపై జనగామ-నర్మెట్ట శివారుకు చేరుకోగానే అడవి పంది వచ్చి వాహనాన్ని ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌యాదవ్ తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం రాత్రి మృతి చెందారు. సోమవారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాల్సిన ప్రవీణ్ మృతి చెందడం అందరిని కలిచివేస్తోంది. ప్రవీణ్ అవయవదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

కుటుంబాన్ని వెంటాడుతున్న మృత్యువు..

కన్నెబోయిన అంజయ్య-పద్మ దంపతులకు కుమారులు నవీన్, ప్రవీణ్ ఉన్నారు. మూడేళ్ల కిందట అంజమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండేళ్ల కిందట నవీన్ వివాహం కాగా, రెండు నెలల కిందట ప్రవీణ్ వివాహమైంది. కుటుంబం మళ్లీ గాడిన పడుతుందనుకున్న క్రమంలో ప్రవీణ్ మృతి తీరని శోకసంద్రాన్ని మిగిల్చింది. ఇదిలా ఉండగా.. ప్రవీణ్ పెద్దనాన్న కన్నెబోయిన సత్తయ్య శనివారం ఉదయం మృతి చెందగా, అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ప్రవీణ్‌కు అంత్యక్రియలు చేశారు.

ఆటో- బైక్ ఢీ.. నలుగురికి గాయాలు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలో రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై డి.నరేశ్ కథనం ప్రకారం.. లింగాలఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన ఓ కుటుంబ సభ్యులు.. చిల్పూరు దేవస్థానానికి ఆటోలో వెళ్తున్నారు. నిడిగొండకు వచ్చాక.. యూటర్న్ వద్ద ద్విచక్రవాహనం మీద వస్తున్న ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన నాగోజు అక్షయ్‌కుమార్ ఆటోను ఢీకొట్టాడు. ఈ క్రమంలో వాహనం బోల్తా పడింది. ఆటో డ్రైవర్ సంతోశ్, అతని సోదరుడు సాయికృష్ణ, కోడలు అభిరూప, మరో వ్యక్తి అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి.. క్షతగాత్రులను 108లో జనగామ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.